క్లుప్తంగా

ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించనున్నామని ఆలయ కార్యానిర్వహాణాధికారి పి.మోహన్ రావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన ఆర్ఎస్ నంబర్ 113లోని 8.72 ఎకరాల మెట్ట మాగాణి భూమి కౌలు వేలం ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. కౌలు వేలం మూడు సంవత్సరాలకు అనగా 2024-2025 నుంచి 2026-2027 సంవత్సరాలకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నిబంధనలకు లోబడి బహిరంగ కౌలు వేలంలో పాల్గొనాలని సూచించారు.

200 మందికి కంటి పరీక్షలు



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శంకర నేత్ర చికిత్సాలయం సహకారంతో కంటి చూపు పరీక్షలు ఉచితంగా చేశారు. దాదాపు 200 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేశారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చన్నం రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ వలవటీర్లు పాల్గొన్నారు.

బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలను ఓడించాలి

గన్నవరం: బీజేపీని, ఆ పార్టీతో పొత్తులు పెట్టుకున్న టీడీపీ, జనసేనలను చిత్తుగా ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. గన్నవరంలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గొల్లు కృష్ణ, సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎన్నార్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల కొనసాగింపు కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. సీపీఎం నేతలు ఆర్.రఘు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, ఏసుదాసు పాల్గొన్నారు.

పది ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం



గన్నవరం రూరల్: మండలంలోని కొండపావులూరు గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు మేడిబోయిన కొండలరావుకు చెందిన పది ఎకరాల వరిగడ్డి వాము దగ్ధమైంది. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం జరిగిందని భావిస్తున్నారు. గన్నవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాద కారణంపై విచారణ చేస్తున్నారు. గ్రామస్తులు అగ్ని ప్రమాదాన్ని గమనించి హుటాహుటిన మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.

హోం ఓటింగ్‌కు 374మంది ఓటర్ల నమోదు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో హోం ఓటర్లు 374 మంది ఉన్నారని ఏఆర్ఓ ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ 85 సంవత్సరాలు వయస్సు పై బడి, 40 శాతం పైగా అంగవైకల్యం కలిగిన వారు 374 మంది ఫారం 12డి సమర్పించారన్నారు. వారి అభ్యర్థనను ఆర్ఓ అంగీకరించారని తెలిపారు. నేటి నుంచి హోం ఓటర్లు ఓటు వేయటానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో హోం ఓటర్ల కోసం ఆరు టీమ్‌లు ఏర్పాటు చేశామని టీంలో ప్రత్యేక పరిశీలకుడు, పీవో, వీడియోగ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉంటారని తెలిపారు. హోం ఓట్ల కోసం టీం ఇళ్లకు వెళ్లిన సమయంలో హోం ఓటరు లేక పోతే రెండవ సారి కూడా టీం వస్తారని, హోం ఓటర్లు ఉపయోగించుకోవాలని సూచించారు.

మోసగాళ్ల మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు

- గతానుభవమే ఇందుకు నిదర్శనం
- మంత్రి జోగి రమేష్



యనమలకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టో ప్రజలు నమ్మరని, గతంలో వీరు చేసిన మోసం ఇంకా ప్రజలు మరిచిపోలేదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ విమర్శించారు. ఆయన బుధవారం యనమలకుదురు గ్రామంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ 2014 సంవత్సరంలో ముగ్గురు మోసగాళ్లు కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని తమకు ఓటు వేస్తే అభివృద్ధి చేస్తామని జనాలను నమ్మించారన్నారు. అధికారం చేపట్టిన తరువాత ముగ్గురు తిట్టుకొని, కొట్టుకొని విడిపోయారని విమర్శించారు. ఇప్పుడు ఇదే మోసగాళ్లు మరలా కలిశారన్నారు. చంద్రబాబు మరలా మేనిఫెస్టో విడుదల చేశారని తెలిపారు. 2014లో చంద్రబాబు రూపొందించిన మేనిఫెస్టో చించి చెత్త బుట్టలో వేశారని, మరలా ఇప్పుడు మరో మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వస్తే నమ్ముతారా అని ప్రశ్నించారు. 2014లో డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు రుణ మాఫీ చేస్తానని మోసం చేశాడని, ఈ విషయమై అక్కాచెల్లెమ్మలు చంద్రబాబును రోడ్డుపై నిలదీయాలన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేసి బ్యాంకుల్లో ఉన్న బంగారు ఆభరణాలు ఇంటికి పంపుతానన్నాడని, ఈ విషయమై రైతన్నలు చంద్రబాబును ప్రశ్నించాలన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని ఎగనామం పెట్టిన చంద్రబాబును యువత చొక్కా పట్టుకోవాలని అన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో అధికారం కోసం రూపొందించిందేనని, వాస్తవానికి అది అమలు చేయటం చంద్రబాబు తరం కాదని ఆరోపించారు. కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ ఓడి ఇంటి దారి పడతారని అన్నారు. ముగ్గురు కలిసి ప్రజలను మభ్యపెట్టి మోసం చేయాలని చేస్తున్న యత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని తెలిపారు.

ప్రజలు డిసైడయ్యారు..

ఈ ఎన్నికల్లో జగనన్నను సీఎం చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని మంత్రి జోగి రమేష్ అన్నారు. గత ఐదేళ్లుగా జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పాలన అందించి, ఎందరో పేదలను ఆదుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ వర్గాలకు అండగా వారి ప్రగతికి జగనన్న ఎనలేని కృషి చేశారని వివరించారు. చంద్రబాబు ఎన్ని వేషాలు వేసినా ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ప్రజలు జగనన్నకే ఓటు వేస్తారని అన్నారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు గిఫ్టుగా ఇస్తామన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, వెలగపూడి వరప్రసాద్, అష్రఫ్, మరీదు శ్రీనివాసరావు, హక్, గుమ్మడి అన్వేష్, ఈడే గోపాలకృష్ణ, కోసూరి నరేష్‌కుమార్, కర్రా ఆదిశేషారావు, అమీర్‌ఖాన్, ఎన్.శ్రీను, దారవత్ రవి, యార్లగడ్డ వీరబాబు, బడుగు మధు, జంపాన కోటేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ



చిక్కవరంలో మహిళలకు ప్రచార కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీ

గన్నవరం రూరల్: ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించాలని గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కోరారు. బుధవారం మండలంలోని చిక్కవరం, కొత్తగూడెం, మెట్లపల్లి, తెంపల్లి, బల్లిపర్రు గ్రామాల్లో పర్యటించారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు, తనకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చిక్కవరం గ్రామంలో సర్పంచ్ అన్నే లక్ష్మణరావు ఆధ్వర్యంలో వంశీకి తీన్‌మార్ డప్పులు, మేళతాళాలతో, యువత బైక్ ర్యాలీతో సాదర స్వాగతం పలికింది. గ్రామంలోని బీసీ కాలనీ, ప్రధాన రహదారి ప్రచారం అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు ప్రచార కరపత్రాలు అందించారు. 58 నెలల పాటు వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన సంక్షేమాన్ని, ఆయా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మోసపూరితమైన హామీలతో ప్రజలను మభ్యపెట్టే మాయదారి కూటమికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సీఎం జగన్ విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో ప్రజలకు మేలు చేశారన్నారు. వైద్యాన్ని పేదల చెంతకు చేర్చిన ఘనత సీఎం జగన్‌దని చెప్పారు. గతంలో పరిపాలన చేసిన చంద్రబాబు ప్రజలకి ఇచ్చిన హామీలను ఏ మేరకు నెరవేర్చాడో ప్రజలే చర్చిస్తున్నారని, పేద ప్రజలకు సంక్షేమం అమలు అయితే వారు అభివృద్ధి చెందుతారని, వారిని పూర్తిగా పేదలగానే ఉంచాలన్న టీడీపీ, కూటమి కుయుక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీకి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో వస్తున్న విశేష ఆదరణ చూస్తున్న కూటమికి నిద్రపట్టడం లేదని అన్నారు. అర్హత ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ వంశీ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతూ అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం పలికారు. మహిళలు డాక్టర్ వంశీని కలిసి అన్నా మీ వెంట మేమున్నాం, మాకు గడచిన 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారని భరోసా ఇవ్వటం అన్ని గ్రామాల్లోనూ కనిపించింది. రాష్ట్ర వైఎస్సార్ సీపీ వైద్య విభాగం మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, కైలే శివకుమార్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పడమట సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ, సామల ఆంజనేయులు, అంగడాల సాంబశివరావు, తూంపాటి రాంబాబు, దేవరపల్లి రాంబాబు, ఆరేపల్లి జేజమ్మ, బండి నాగసాంబిరెడ్డి, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, నందిపాటి సుబ్బారెడ్డి, నీలం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం



ఎన్నికల ప్రచారంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా, జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ సంక్షేమ పథకాలు అందించారని గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామవరప్పాడులో సర్పంచ్ వరి శ్రీదేవి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, కోనేరు సుబ్బారావు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను ఎమ్మెల్యేగా మరోకసారి అఖండ మేజారిటీతో విజయం చేకూర్చాలన్నారు. జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ప్రజలు తమ విలువైన ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, మహిళా నాయకురాలు పరిమి సింధూర, గన్నవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మెండె సుధాకర్, కందిమళ్ల ఆంజనేయులు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారం



గౌడపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు మద్దతుగా గ్రామాల్లో పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. స్థానిక గౌడపేటలో బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పేదలకు వంశీమోహన్ అందిస్తున్న సేవలు గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఇరువురిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ చిమట శ్రీనివాసరావు, వార్డు సభ్యులు లుక్కా ప్రసాద్, చిమట శ్రీను, పడమట వీరకుమారి, దుర్గ, పార్టీ నేతలు పడమట నాగరాజు, శివయ్య, పడమట రంగారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాయ్‌నగర్‌లో పార్టీ నేతలు వింత రవీంద్రరెడ్డి, బూసిరెడ్డి, బర్మా శ్రీను పొన్నగంటి శివ, ఆశారేఖ, వింత జయగీత గడప గడపకు ప్రచారం చేశారు. బుద్దవరంలో వంశీమోహన్‌కు మద్దతుగా ఉప సర్పంచి వేల్పూరి బసవరావు, పలువురు పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కేసరపల్లిలో వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పాలన కోసం వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు బొడ్డు అంజనేయ వర ప్రసాద్, మెండెం రాంబాబు, డీవీ, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సారథి వైఎస్ జగన్



తారకరామ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గాంధీ, ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన విప్లవాత్మక సంక్షేమ పథకాలపై అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ చెప్పారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక తారకరామ కాలనీలో గాంధీతో పాటుగా జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయ నాయుడు, మాజీ చైర్మన్ కొల్లి వెంకట్రావు, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి నేతృత్వంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. యువత, మహిళలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల మంజూరు కోసం జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సివచ్చేదని గుర్తు చేశారు. నవరత్నాల ద్వారా పేద ప్రజలకు మరింత మేలు చేసేందుకు వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు.

పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి



నున్నలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నున్న(విజయవాడరూరల్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ నాయకులు నున్న గ్రామంలో ఓటర్లకు వివరిస్తూ బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గ్రామంలోని పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలుపొందాలన్నారు. ఫ్యాన్‌గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సర్పంచి కాటూరి సరళ, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, బొంతు సరోజిని, పెండెం గిరిజాకుమారి, మాజీ ఉప ఎంపీపీ జీతం శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచి భీమవరపు శివరామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, బొంతు సాంబిరెడ్డి, రామ్మోహనరెడ్డి, అరుణ, మాజీ సర్పంచి కర్రె విజయ్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పెరుగుతున్న ఎండలతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కనకదుర్గనగర్ మహా మండపం మార్గంలో పీచుతో ఏర్పాటు చేసిన కార్పెట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. పలు చోట్ల మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంచినీటి చలివేంద్రాలలో తాగునీటిని అందిస్తుండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి కొండపై ఉండే మూగజీవాలకుతాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో కేఎస్ రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలు చోట్ల కోతులకు, పావురాల కోసం ప్లాస్టిక్ గిన్నెలను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు.

ఉద్యోగుల పనితీరు అభినందనీయం

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ఇండియన్ రైల్వేలో గ్రూప్-డీ ఉద్యోగుల పనితీరు అభినందనీయమని సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ వర్షాపాటిల్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం (మేడే)ను బుధవారం రైల్వే ఆస్పత్రి వద్ద ఉన్న ఈ-వరల్డ్‌లో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వర్షాపాటిల్ మాట్లాడుతూ ఇండియన్ రైల్వేకి గ్రూప్-డీ ఉద్యోగులు వెన్నెముకలాంటి వారన్నారు. వారే రైల్వేకి నిజమైన హీరోలన్నారు. వారి కృషి, నైపుణ్యంతో ఇండియన్ రైల్వే ముందుకు దూసుకుపోతోందన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నేతలు



వీరపనేనిగూడెంలో డాక్టర్ వంశీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకులు



మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ప్రచారంలో జనసేన పార్టీ నాయకులు ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు డి.రోశయ్య ఆధ్వర్యంలో కాలనీకి చెందిన 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ వంశీమోహన్ నాయకత్వం పట్ల, విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంపీపీ అనగాని రవి, సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ శివభరత్ రెడ్డి, ఉపసర్పంచ్ నాగసాంబిరెడ్డి, సహకార బ్యాంకు చైర్ పర్సన్ బొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి, నందిపాటి సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పెనమలూరు: కానూరు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు బుధవారం మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీ లో చేరారు. కానూరుకు చెందిన తుమ్మల స్వామి అతని అనుచరులు గంగూరులోని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరగా మంత్రి జోగి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీల నుంచి నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు.

నేడు కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు మొక్కులు తీర్చుకునే కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలం గురువారం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు సంవత్సరం కాలపరిమితికి ఆలయంలో కొబ్బరి చిప్పలు సేకరించుకోవటానికి బహింగ వేలం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా కార్మిక దినోత్సవం



ఎర్ర జెండా ఎగురవేస్తున్న ప్రజా సంఘాల బాధ్యులు



ఎర్ర జెండా ఎగురవేస్తున్న ఆజాద్



యనమలకుదురు మేడే వేడుకల్లో కార్మికులు



సీఐటీయూ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు

కంకిపాడు: మేడే వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మండేపూడి భవన్ వద్ద వేడుకలు జరిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తాడంకి నరేష్, వీ శివశంకర్, వేమూరి నాగేశ్వరరావు, కె.నాంచారయ్య, వి.వెంకటేశ్వరరావు, పి.దుర్గారావు, వై.జోజి, వెంట్రప్రగడ మరియదాసు, ఈ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు, గొడవర్రు, మద్దూరు, ఉప్పలూరు, జగన్నాథపురం, కుందేరు గ్రామాల్లో మేడే నిర్వహించారు. సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరావు, జి.కుమారి, వై.నళినీకుమారి, సంధ్య, భవాని, రామకృష్ణ పాల్గొన్నారు. కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉప్పలూరు, తెన్నేరు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో సంఘ నాయకులు ఎన్.సర్వేశ్వరరావు, ఎం.లక్ష్మీనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు వెలగపూడి ఆజాద్ ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచ కార్మికుల హక్కుల పోరాట ఫలితంగానే మేడే ఏర్పడిందన్నారు. దేశంలో కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేయడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేకి బీజేపీని ఓడించేందుకు ప్రజలందరూ కలిసిరావాలని కోరారు. పార్టీ ఏరియా కార్యదర్శి పెద్దు వెంకటరత్నం, పార్టీ నేతలు ముక్కామల ఉమామహేశ్వరరావు, రామచంద్రజోషి, శనగల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: పెనమలూరులో కార్మిక దినోత్సవం ఘనంగా చేశారు. సీఐటీయూ కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్, ఆటో వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్ పలు గ్రామాలలో ఎర్ర జెండా ఎగురవేశారు. మేడే సందర్భంగా కార్మికులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంతో పోరాడి రోజుకు 8 గంటలు మాత్రమే పని గంటలు సాధించారన్నారు. ఏ రంగంలోనైనా కార్మికులకు సమస్యలు ఎదురయిన సమయంలో కార్మికులు అందరూ ఏకమై పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేతలు కిలారు బుడ్డయ్య, షేక్ కాశిం, గొలుసు వీరయ్య, పుసులూరి సత్యనారాయణ, వై.సరళ, మధిర ఏడుకొండలు, పలువురు నేతలు, కార్మికులు పాల్గొన్నారు. కాగా తాడిగడప వంతెన వద్ద జరిగిన మేడే ఉత్సవాలలో కార్మిక నాయకుడు కొసరాజు మల్లేశ్వరరావు నిర్వహించారు. కొండవీటి శివయ్య, టి.సత్యనారాయణ, వంగూరు సుబ్బయ్య, ఎం.పాల్, కిలారు సాంబశివరావు పలువురు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: కార్మిక హక్కుల పరిరక్షణకై ఐక్యంగా పోరాటం సాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ఎర్ర జెండా ఎగురవేశారు. జంక్షన్ ప్రధాన కూడలి, ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్, పెరికీడు వంతెన, కానుమోలు, బందారుగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, వీరవల్లి గ్రామాల్లో మేడేను పురస్కరించుకుని కార్మిక సంఘాలు ఎర్ర జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రధాన రహదారుల్లో ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మికుల సంఘం, ప్రైవేట్ ఎలక్ట్రికల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్, పార్శిల్ ముఠా వర్కర్స్ యూనియన్, ఇసుక ముఠా వర్కర్స్ యూనియన్, పెయింటర్స్ యూనియన్, ఆటో డ్రైవర్స్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.